# నేనెవర్నో తెలిసింది

యూనివర్సిటీలో చదువుతోన్న రోజులవి. ఓ ఆదివారం ఉదయం ముసాబుగా ఉంది. నల్లటి చిక్కటి సముద్రంలో, కెరటాలు తెల్లని నురగల్ని వెదజల్లుతున్నాయి. హోరు గాలి నరాల్ని జివ్వుమనిపిస్తోంది.

"ఏదో సినిమాకి పోయి వెచ్చగా కూర్చోవాలనిపించింది. వెధవది-గదిలో రగ్గు కప్పుకొని పండుకొంటే వెచ్చగా ఉండదూ? ఉంటుంది - కాని సినిమా చూడాలన్న కోరిక ఎక్కువగా ఉండడం మూలాన, పక్క గదికి పోయి సుబ్బారావుని కదిపాను. అతగాడికి యిష్టం లేకపోయినా, బలవంతంగా లేవదీసాను. సిటీబస్‌కి డబ్బులిచ్చాను. సినిమాహాలు దగ్గర నాలుగురూపాయిలిచ్చి టిక్కట్లు తీశాను. కిళ్ళీ దుకాణంలో సిగరెట్లు కొంటూండగా-

'బాబూ ధర్మం' అంటూ ఓ బక్క చిక్కిన ముసల్ది చెయ్యి చాచింది. ఆమెని తప్పించుకొంటూ లోపలికి దారితీశాము. సినిమా చూస్తున్నప్పుడు రెండు మూడు మార్లు వళ్ళు వేడెక్కింది కాని, నేను ఆశించిన వెచ్చదనం మట్టుకు లభించలేదు. సినిమా మొత్తంమీద చెత్తగా ఉంది. సుబ్బారావుకి తలనొప్పి వచ్చిందని నా మీద విరుచుకుపడ్డాడు.

దారి పొడుగునా సాధిస్తూనే ఉన్నాడు.

"ఆకలితో అలమటించే ఓ ముసలిదానికి ఒక్క పైసా కూడా విదల్చలేకపోయాను కాని, కంపెనీ కోసమని యిష్టంలేనివాణ్ణి బలవంతంగా సినిమాకు తీసుకెళ్ళి, ఖర్చులన్నీ భరించాను. తిట్లు కూడా తిన్నాను. నాకు మనసదోలా అయిపోయింది.

"నాలుగు రోజుల తర్వాత త్యాగరాజుతో బజారులో నడుస్తోండగా, రోడ్డు కవతలగా చెత్తకుండీ పక్కన కూర్చుని అడుక్కొంటూన్న ఆ ముసలిది కనుపించింది. అప్రయత్నంగా జేబులోకి చెయ్యి వెళ్ళి, ఓ రెండు రూపాయల నోటుతో బయటకు వచ్చింది. రోడ్డు దాటి వెళ్దామనుకొంటూండగా, సిటీ బస్ అడ్డమొచ్చింది. ఒక్క క్షణం ఆగాను.

'పని కట్టుకొని, రోడ్డు దాటి ముష్టిదానికి రెండు రూపాయలిచ్చేశాడు. వీడు పిచ్చివెధవలా ఉన్నాడు' అని త్యాగరాజు అనుకోడూ? అనుకొంటాడనిపించింది. పైకి తీసిన నోటు మళ్ళీ జేబులో పెట్టేశాను. త్యాగరాజుతో నడుచుకొంటూ వెళ్ళిపోయాను.

"కొత్తగా ఉద్యోగం చేస్తున్న రోజులు. మళ్ళీ ఓ ఆదివారం. హోరు మంటూ వర్షం కురుస్తోంది. వర్షంతోపాటు కోరికల తుఫాను. వెచ్చగా రగ్గు కప్పుకొని, ఏదో నవల చదువు తున్నాను. అట్టమీదనున్న ఆడదాని బొమ్మ దిగంబరంగా ఉంది. పనిమనిషి చంద్రి చీపురు పట్టుకొని, గదిలోకివచ్చి తుడవడం మొదలుపెట్టింది. ఇరవై యేళ్ళ వయసు చంద్రిని చాలా అందంగా చేసింది. చంద్రి వంగుని తుడుస్తోంటే, నాలుగైదుసార్లు దొంగ చూపులు చూశాను. మరోసారి చూసినప్పుడు పమిట జారిపోయి ఉంది. చంద్రి అవయవాల సొంపులు నాలో అగ్నిపర్వతాల్ని బ్రద్దలు కొట్టాయి. మంచం మీద నుంచి లేచి, చంద్రిని వాటేసుకోవాలనిపించింది. వెర్రి ఆవేశంతో లేవబోయాను. చంద్రి చూపులు నా చూపులతో కలిశాయి. మరుక్షణంలో చేతిలో ఉన్న పుస్తకాన్ని పక్కన పడేసి, దినపత్రిక అందుకొన్నాను. చంద్రి జారిపోయిన పమిటను సర్దుకొని, గది తుడిచి వెళ్ళిపోయింది. ఆ తర్వాత ఆదివారం గదిలోనే ఉన్నాను. చంద్రి రాలేదు. పనిలోకి రావడం మానేసింది.

"పక్కింటి ప్లీడరుగారబ్బాయి లేవదీసుకుపోయాడు. పదిహేను సంవత్సరాల తర్వాత ఓ రోజున-హైద్రాబాద్ వెళ్ళే బండి కోసం ఎదురుచూస్తూ, విజయవాడ స్టేషన్లో పచార్లు చేస్తున్నాను. "బాబూ ధర్మం" అన్న ఓ ఆడదాని గొంతు విని పక్కకు తిరిగి చూశాను - రోగాలతో కుళ్ళిపోయి, దీనాతి దీనమైన చూపుల్తో చెయ్యి చాచిన చంద్రి! అప్రయత్నంగా పది రూపాయల నోటు తీసి ఆమె చేతిలో పెట్టాను. దిగ్భ్రమగా నా కేసి చూసింది. "నిక్షేపంలా ఉండవలసినదానివి, ఏమిటిది??" అనగల్గాను. నన్ను గుర్తుపట్టింది.

'అందరూ మీలాంటి దొడ్డమనసుకలవాళ్ళే అయితే, మాలాంటివాళ్ళు, యిలా మోసపడక పోదురు బాబూ' అంటూ వెళ్ళిపోయింది. చంద్రి పతనానికి కారకులయిన వాళ్ళలో, నేనూ ఒకణ్ణి కానందుకు సంతోషించాను. అయినా, ఆ రోజున నాలో పగిలిన అగ్ని పర్వతాల సంగతి చంద్రికి తెలియదు. తెలిస్తే పై మాటలు అనగలిగేదా? ఆమె పొగడ్తకి నేనర్హుణ్ణి కాదు--

"ఆఫీసు పనిమీద కలకత్తా వెళ్ళి నెల రోజుల తర్వాత తిరిగి వచ్చాను. మా ఆఫీసు

జీప్ డ్రైవర్ని పనిలోంచి తీసి పారేశారు. పెట్రోలు దొంగతనంగా తీసుకుపోతోంటే పట్టుబడ్డాడట. నా తోటి ఆఫీసరు విచారణ జరిపాడట. నేరం ఋజువు కావడం మూలాన పని లోంచి తీసేశారు. నేను వచ్చిన రోజునే డ్రైవర్ నూకరాజు వచ్చి కాళ్ళ మీద పడ్డాడు, తిరిగి ఎలాగైనా ఉద్యోగం యిప్పించమని. నేను ఎంత ప్రయత్నించినా నూకరాజుకి ఉద్యోగం యిప్పించలేకపోయాను. మరోచోట ఉద్యోగం దొరికేంతవరకూ అతగాడికి చేతనైన సహాయం చేస్తానని మాటిచ్చి పంపించేశాను. నా మనసు పాడైపోయింది. ఉద్యోగానికి రాజీనామా యివ్వాలనిపించింది. ఎందుకంటే -- ఎన్నోసార్లు మా ఆఫీసర్ల ఆడవాళ్ళు ఆ జీప్‌లో మార్కెట్లకీ, షాపింగ్‌లకీ తిరిగారు. రోగాలూ, రొచ్చులూ వచ్చినప్పుడు ఆస్పత్రులకీ, కులాసాగా ఉన్నప్పుడు విలాస యాత్రలకీ ఆ జీప్ తిరిగింది. అయితే ఇవన్నీ జీప్‌ని ఆఫీసు పనులకు తిప్పిన దూరంలో కలిసి పోయాయి! మాకు, నూకరాజుకీ తేడా ఏమిటి? నూకరాజు నిలదీసి, ఈ ప్రశ్న అడిగితే సమాధానమేముంది-- రాజీనామా యిద్దామన్న ఆవేశం తప్ప ఏమీ చెయ్యలేకపోయాను. పాతికేళ్ళ సర్వీసుని గంగపాలుచేసి, భవిష్యత్తుని ఎలా అంధకారం చేసుకొనేది? ఆ ఆలోచన అలానే అణగారిపోయింది. ఉద్యోగంలో మరో రెండు మెట్లు పైకి వెళ్ళిన తర్వాత రిటైరయ్యాను-

"ఇవి నా జీవితంలో కొన్ని సంఘటనలు. ఇప్పుడు చెప్పండి మీరు నా గురించి ఏమనుకొంటున్నారో?" ప్రశ్నించాను.

మనస్తత్వ శాస్త్రవేత్త కోదండపాణి చిరునవ్వు నవ్వాడు.

"మీ ఆత్మపరిశీలనే - జీవితంలో విజయాల్ని సాధించడానికి దోహదం చేసింది. దాని మూలానే మీరు చాలా సక్రమైన జీవితాన్ని గడపగల్గారు. ఇప్పుడు మీరు మానసికంగానూ, శారీరకంగాను విశ్రాంతి పొందాలి. ఈ మందులు.."

ఓ రోజు సాయంత్రం, గంటల తరబడి కురిసిన వర్షం వెలిసింది. ఇంటి ఆవరణలో ఓ నీటి మడుగు ఏర్పడింది. నా మనవలిద్దరూ ఆటలికి దిగారు.

ఉన్నట్టుండి పెద్దవాడన్నాడు-

"ఒరేయ్, ఇవతల్నించి అవతలకు దూకాలి!"

రెండోవాడు కొంచెం దూరం వెళ్ళి, పరుగెత్తుకొంటూ వచ్చి దూకాడు. కాని అవతలివైపుకు వెళ్ళలేక, నీళ్ళలోనే పడ్డాడు. బట్టలన్నీ తడిసిపోయాయి. లేచి ఏమీ జరగనట్టుగా వంటి కంటిన బురదని విదుల్చుకొంటున్నాడు. వాడి కళ్ళలో ఏదో ఆనందం! పెద్దవాడు చూస్తూ ఉండిపోయాడు. చిన్నవాడు అన్నని హేళన చేస్తున్నాడు.

"పడిపోతామన్న భయంతో ఉంటే నువ్వు ఎలా దూకుతావు? నువ్వొత్త పిరికివాడివి!"

నా పెద్ద మనవణ్ణి అందరూ నా పోలికే అంటారు!

పేరు కూడా నాదే!

నేనెవర్నో నాకు తెలిసింది! ●

('యువ' మాసపత్రిక : ఫిబ్రవరి 1975)